క్లుప్తంగా...

వసతి గృహంలో వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

శంషాబాద్ రూరల్: పాల్మాకులలో ఉన్న బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెద్దషాపూర్ పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థినులు జాగ్రత పాటించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

ఏజీవర్సిటీ: పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర వివిధ జిల్లాలు తిరుగుతూ నేడు ఆదివారం రాజేంద్రనగర్‌లోకి ప్రవేశించనుందని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన రాజేంద్రనగర్‌లో మాట్లాడుతూ.. 'అభినహితో కబీనహీ'అనే నినాదంతో జూలై 16న ప్రారంభమైన్న ఈ యాత్ర 30న రాజేంద్రనగర్‌లోని రానుందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం గేట్ నుంచి డైరీ ఫామ్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని అక్కడ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘాలకు అతీతంగా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నాని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో వర్షం వల్ల తలెత్తిన సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు స్థానిక సమస్యలను వివరించారు. డ్రైనేజీల మరమ్మతుల కోసం ఎవరూ కూడా ఇప్పటి వరకు తమ బస్తీకి రాలేదని పలువురు ఆయనకు తెలిపారు. పారిశుద్ధ్య పనులు కూడా అస్తవ్యస్తంగా తయారయ్యాయని వారన్నారు. పారిశుద్ధ్య పనుల కోసం ప్రస్తుతం ఉన్న యూనిట్లకు తోడుగా అదనపు యూనిట్లను కూడా నియమించామని ఎమ్మెల్యే వారితో అన్నారు. ప్రతి బస్తీలో పర్యటించి ముందుగా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, అధికారులను ఆదేశించామని తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీమొద్దీన్ తదితరులున్నారు.

శాస్త్రీయ నృత్య కళల పట్ల మక్కువ పెంచాలి

గన్‌ఫౌండ్రీ: నేటితరం విద్యార్థులకు చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీత నృత్యాలపై మక్కువ కల్పించాలని ఏపీ జెన్‌కో పూర్వ సంచాలకులు జీవీ అప్పారావు అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో రాధా నృత్యాలయం 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురు పరంపరలో భాగంగా రాధా మోహనం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజానికి ఇటువంటి శిక్షణాలయాలు అవసరమని, మన కళలకు పునర్వైభవం రావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ నృత్యగురువు రాధామోహన్ శిష్యబృందం చేసిన నృత్యరూపకం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ పూర్వ సంచాలకులు వేణుగోపాల్, సంస్థ వ్యవస్థాపకులు రాధామోహన్ పాల్గొన్నారు.

సత్కారం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ కుమార్‌ను శనివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలుతెలిపారు. ఈ ఆయనతో పాటు లలితాబాగ్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు, చాంద్రాయణగుట్ట డివిజన్ జనరల్ సెక్రటరీ నరేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఊరేగింపులో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



షర్బత్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను జరుపుకున్నారు. సుల్తాన్‌పల్లి, మల్కారం, కేబీ దొడ్డి, రామంజాపూర్, పెద్దషాపూర్, పెద్దతూప్ర, పాల్మాకుల తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. పీర్లకు దట్టీలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

పీరం చెరువులో షర్బత్ పంపిణీ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం మొహర్రం పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పీరంచెరువు మెయిన్ రోడ్డుపై పర్వదినాన్ని పురస్కరించుకొని షర్బత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీరంచెరువు మాజీ వార్డు సభ్యులు మహమ్మద్ అమీన్, ఇస్మాయిల్, సాదిఖ్, మక్బూల్, రియాజ్, అలీముద్దీన సందానీ, దస్తగిరి, హాజీ, ఉమర్, గౌస్, అఖిల్ తదితరులున్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో..

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంప్రదాయ గుర్తులకు అనుగుణంగా ప్రజలంతా పండగలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌ముదిరాజ్, సేలం, అన్వార్, మహమ్మద్‌గౌస్, హసన్, అబ్దుల్, మురళీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను ఆధునీకరిస్తున్నాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి ఎప్పడికప్పుడు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్‌లో శనివారం బీటీ, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చొరవతో కార్పొరేషన్ పరిధిలో హైదరాబాద్ మెట్రో రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో పిల్లర్ నెంబర్-213 నుంచి రిచ్‌మండ్ హోటల్ వరకు రెండు కిలోమీటర్లు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా కాంట్రాక్టర్‌కు, అధికారులకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా మ్యాన్‌హోల్స్, మంచినీటి పైపులైన్‌లను వేయాలని సూచించామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌డీఏసీఎల్ డీఈ సత్యనారాయణ, ఏఈఈ మురళీకృష్ణ, సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, 6వ డివిజన్ ప్రెసిడెంట్ హఫీజ్‌ఖాన్, సుమన్‌గౌడ్, నదీం, షఫీ, ఇలియాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జియాగూడ కమేళా ఆధునీకరణకు కృషి



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆరె కటిక సంఘం ప్రతినిధులు

జియాగూడ: జియాగూడ కమేళాను సందర్శించి ఆధునీకరణకు కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, చర్మకష్ సంఘం అధ్యక్షుడు శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శన్‌కుమార్ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి నగరంలోని ఐదు కమేళాలను యాధాస్థానంలో ఆధునీకరిస్తామని హామీ ఇచ్చి నాలుగు కమేళాలు పూర్తి చేశారు. కానీ జియాగూడ కమేళాను నిర్మాణం కాలయాపనగా అయ్యిందన్నారు. జియాగూడ స్లాటర్ హౌస్ నిర్మాణాన్ని ప్రభుత్వ వ్యయంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించి ఆరె కటిక, దానిపై ఆధారపడి జీవిస్తున్న ఇతర కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీ రేవంత్ రెడ్డికి విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సుభాష్, జ్ఞానేశ్వర్, హరికిషన్, కేఎస్ మనోజ్ కుమార్, సత్యం, కేఎస్ ప్రేమ్‌కిశోర్, నరేష్, సాయి, గురుదాస్ పాల్గొన్నారు.

రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీధర్



నియామక పత్రం అందుకుంటున్న శ్రీధర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు వేముల మల్లేష్ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి వేముల మల్లేష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికారి ప్రతినిధి వేముల మల్లేష్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో బీజేపీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. తనపై ఎంతో నమ్మకంతో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులకు ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.బాబురావు, మూల శ్రీనివాస్‌గౌడ్, బండారి బాలకృష్ణ, సామ రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పదవులు తీసుకున్న నాయకులు వాటికి వన్నె తెచ్చేలా కష్టపడి పనిచేయాలని మణికొండ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సంగం కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ధన్‌రాజ్‌సింగ్, మాల్యాద్రినాయుడు, మహేష్‌రెడ్డి, శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శిగా అఖిల్ పటేల్, సంయుక్త కార్యదర్శులుగా మహేందర్, రాజు, పృథ్వీరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివయ్య, ప్రచార కార్యదర్శిగా శ్రావణ్, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా కుమార్, ముఖ్యసలహాదారులుగా సుబ్బారెడ్డి, రాజు, వాసిరెడ్డి నరేష్, శివారెడ్డిను ఎన్నుకున్నారు. వీరితో పాటు 13మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుల బృందం

సుల్తాన్‌బజార్: తీవ్రమైన శ్వాస ఇబ్బందితో బాధపడుతున్న ఓ చిన్నారికి కోఠి ఈఎన్‌టీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం, ముప్పారం గ్రామానికి చెందిన హేమలత అనే చిన్నారి శ్వాసనాళంలో పులిపిరి లాంటి (పాపిల్లోమా) అనే వ్యాధి రావడంతో ఈఎన్‌టీ ఆస్పత్రికి శస్త్ర చికిత్స నిమిత్తం వచ్చారు. ఈ ప్రాణాంతకరమైన వ్యాధికి డాక్టర్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో చిన్నారికి ఆపరేషన్ చేసి పాపిల్లోమాను తొలగించారు. ఆపరేషన్ తర్వాత పాప ఆరోగ్యం మెరుగుపడడంతో డాక్టర్లు, ఆమె తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సత్యకిరణ్, డాక్టర్ ఆశీష్, డాక్టర్ మీనా, అనస్థీషియా వైద్యులు నిఖిల, స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.

గో సేవా అధ్యక్షుడిగా మధుసూదన్‌శర్మ



మధుసూదన్‌శర్మకు పార్టీ కండువా కప్పుతున్న జాతీయ నాయకులు

మణికొండ: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ గో సేవా విభాగం అధ్యక్షుడిగా మణికొండ మల్లన్న ఆలయ అర్చకుడు డాక్టర్ మధుసూదన్‌శర్మను నియమించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ఆ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ఆయనను నియమించారు. ఈ సందర్భంగా మధుసూదన్ శర్మ మాట్లాడుతూ.. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పంచ సూత్రాలకు ఆకర్షితుడినై ఈ పార్టీలో చేరానన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. గోసేవా విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా శేషశయనారావును నియమించారు. ఈ కార్యక్రమంలో గో సేవా విభాగం జాతీయ అధ్యక్షుడు కేవీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనలో అపార్ట్‌మెంట్ వాసులు

అత్తాపూర్: గృహ సముదాయాల మధ్య భారీ సెల్లార్ గుంతలను త్వడంతో పక్కనే ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు కుంగడం ప్రారంభించాయి. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నారు. భారీ గుంతను తవ్వి పనులను చేపడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు అపార్ట్‌మెంట్ మట్టి కూలడం ప్రారంభమైంది. దీంతో స్థానికంగా ఉన్న వాసులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్దికొద్దిగా మట్టి జారుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోని తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భారీ సెల్లార్ గుంతను తవ్వడంతో కూలుతున్న అపార్ట్‌మెంట్ మట్టి

అడిషనల్ డీసీపీగా కోటేశ్వర్‌రావు



అబిడ్స్: రెండేళ్లకు పైగా గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహించిన బి.కోటేశ్వర్‌రావుకు అడిషనల్ డీసీపీగా పదోన్నతి లభించింది. నగరంలో కొన్ని సంవత్సరాలుగా ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా, ఏసీపీగా పనిచేసిన కోటేశ్వర్‌రావుకు రాచకొండ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ అడిషనల్ డీసీపీగా నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశారు. పదవీబాధ్యతలు స్వీకరించిన కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకై ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

మాకు న్యాయం చేయండి



న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కోరుతున్న బస్తీవాసులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ ప్రాంతంలోని తమ పొలాలను సర్వే చేసి తమకు అప్పగించేలా తగు చర్యలు తీసుకోవాలంటూ రాజేంద్రనగర్ వాసులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం ఉదయం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి తమ సమస్యను వివరించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. హరిజనులైన 20 కుటుంబాలకు సర్వే నెంబర్ 91లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 7 ఎకరాల స్థలాన్ని అందించారన్నారు. 1975లో తమకు అప్పగించడంతో అప్పటి నుంచి కిస్తూ చెల్లిస్తూ వ్యవసాయం చేశామన్నారు. 87 ఎకరాలలో ప్రభుత్వం 27 ఎకరాలను తమ వద్ద నుంచి తీసుకోని రూరల్ టెక్నాలజీ పార్కు(ఆర్‌టీపీ)కు అందించిందన్నారు. మిగిలిన 60 ఎకరాలలో వ్యవసాయం చేశామన్నారు. ఆర్‌టీపీతో పాటు ఎన్ఐఆర్‌డీ, గ్రేహౌన్స్ ఫైరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో తాము పొలాల్లోకి వెళ్లకుండా అడ్డంకులు సృష్టించారన్నారు. ఇదే విషయమై తాము వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగామన్నారు. తమ స్థలాన్ని సర్వే చేసి అప్పగించాలని సీసీఎల్ఎస్ఏకు దరఖాస్తు చేయగా రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు సర్వే చేయాలని ఆదేశించారన్నారు. కానీ ఎమ్మార్వో వివిధ కారణాలు చూపుతూ సర్వే చేపటడం లేదని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు తెలిపి తమకు న్యాయం చేయాలని కోరామన్నారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పతిహార రాజు, పచ్చ శ్రీనివాసులు, మంత్రి చంద్రశేఖర్, మల్కారం రాములు, పతిహార నర్సింహ, సాబాజ రాములు, బచ్చల మహేష్, ఇస్రాగండి బాబురావు, శ్రీరాములు, జంగయ్య, మంచిరేవుల రాజు, కోరని క్రాంతి, రాదేశ్యాం తదితరులున్నారు.

ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.59 లక్షలు మంజూరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత బస్తీలు, కాలనీలలో ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.59 లక్షలు మంజూరయ్యాయని కార్పొరేటర్ అర్చనజయప్రకాష్ వెల్లడించారు. శివరాంపల్లిలోని తన కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. భారీగా కురిసిన వర్షానికి, వరదలకు బీటీ రోడ్లు కొట్టుకుపోయాయన్నారు. సీసీ రోడ్లు సైతం దెబ్బతిన్నాయన్నారు. ఈ ప్యాచ్‌వర్క్ నిర్వహణ కోసం రూ.59 లక్షలు మంజూరయ్యాయని వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభం అవుతాయన్నారు. తాత్కాలికంగా రోడ్ల మరమ్మతులను జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. వర్షాల నేపథ్యంలో బస్తీల్లో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా ఇప్పటికే ఇంజనీరింగ్, జల మండలి అధికారులతో సమావేశం నిర్వహించామని ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



గగన్‌పహాడ్ వద్ద జాతీయ రహదారి దాటేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ జాతీయ రహదారి వద్ద సూచిక బోర్డులతో పాటు స్థానిక ప్రజలు రోడ్డు దాటేందుకు ఏర్పాట్లు చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ వినయ్ రెడ్డి అధికారులను కోరారు. శనివారం స్థానికులతో కలసి జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గగన్‌పహాడ్ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించాలంటే బెంగళూరు జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుందన్నారు. జాతీయ రహదారి కావడంతో పాటు ఈ రహదారిపై ఎయిర్‌పోర్టుకు వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో బిజీగా ఉంటుందన్నారు. గగన్‌పహాడ్‌కు చెందిన గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల కోసం వెళ్లే ప్రజలు తప్పనిసరిగా ఈ రహదారి గుండానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. వాహనాల రద్దీ అధికం కావడంతో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొత్తగా ఫ్లై ఓవర్ వేయడంతో వాహనాల వేగం మరింత పెరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సూచిక బోర్డులతో పాటు వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా భారీ క్రేడ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ఆర్ అండ్‌బీ శాఖతో పాటు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు విభాగాలకు గతంలో విన్నవించామని కానీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. మరోసారి బీజేవైఎం తరపున విన్నవిస్తామని అయినా స్పందించకపోతే జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామన్నారు.

వృద్ధులకు చేయూత

మణికొండ: వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు ఉపయోగపడే సామగ్రిని అందించి తమవంతు సేవా గుణాన్ని మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ వారు చాటుకున్నారని క్లబ్ జిల్లా గవర్నర్ భాస్కర్‌గుప్తా అన్నారు. శనివారం మణికొండ హుడా కాలనీలో ఉన్న ఎస్ఆర్‌ఆర్ వృద్ధాశ్రమంలో తమ క్లబ్ తరపున వృద్ధులకు ఉపయోగపడే వెడ్ గ్రైండర్, కుర్చీలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇవ్వటం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. మణికొండ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ కపుల్స్ మణికొండ అధ్యక్షురాలు శిరీష, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రామ్‌సురేష్, జిల్లా డీసీ ఈశ్వర్‌ప్రసాద్, నాయకులు నవీన్‌గుప్తా, సభ్యులు పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు కిరణ్, యశ్వంత్ సామగ్రిని అందజేశారు.



వృద్ధులకు సామగ్రిని అందజేస్తున్న వాసవీ క్లబ్ కపుల్స్ సభ్యులు

దోమల నివారణకు కృషి చేయాలి



నార్సింగిలో నీటినిలువ కేంద్రాలలో ఆయిల్ బాల్స్‌ను వేస్తున్న కౌన్సిలర్

మణికొండ: వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగి అనేక రోగాలు వస్తాయని, వాటి పెరుగుదలను ఎక్కడికక్కడ నివారిస్తేనే ప్రజల ఆరోగ్యానికి మేలని నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. శనివారం ఆమె నార్సింగి పశువుల మార్కెట్‌లో నిలిచిన వరద నీటిలో దోమల వ్యాప్తి పెరగకుండా మున్సిపాలిటీ నుంచి ఆయిల్ బాల్స్‌ను వేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు ఎక్కడా వర్షం నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. వరద నీరు నిలువ ఉండే చోట్ల ఇలాంటి ఆయిల్ బాల్స్‌ను వేస్తే దోమల వ్యాప్తి తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

రాజేంద్రనగర్: విద్యార్థులు బాగా చదువుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వెంకయ్య అన్నారు. శివరాంపల్లిలోని కేంద్రీయ విద్యాలయం ఎస్‌పీఏ, ఎన్‌పీఏలో ఎన్ఈపీ-2020 3వ వార్షిక సంబరాలను నిర్వహించారు. ఈనెల 26, 27, 28వ తేదీల్లో వివిధ పోటీలు నిర్వహించారు. అందులో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు శనివారం బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

